# 32. అస్ సజ్‌దహ్ (సాష్టాంగ ప్రణామం) సూరా

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 30 ఆయతులు ఉన్నాయి. మరణానంతరం మళ్ళీ లేపబడడం గురించి, పరలోక జీవితం గురించి ఈ సూరా నొక్కి చెప్పింది. అవిశ్వాసులు మరణానంతరం మళ్ళీ లేపబడడం గురించి అనుమానాలు వ్యక్తం చేసారు. పరలోక జీవితాన్ని వాళ్ళు విశ్వసించలేదు. దైవప్రవక్త ముహమ్మద్(సఅసం)తో ఈ విషయమై వాళ్ళు వివాదానికి దిగేవారు. ఈ ప్రశ్నలతో ఆయన సందేశాన్ని తిరస్కరించడానికి ప్రయత్నించేవారు. ఈ సూరా అల్లాహ్ ఔన్నత్యాన్ని కొనియాడే ఆయత్‌తో ప్రారంభమవుతుంది. అల్లాహ్ శక్తిసామర్థ్యాలను, ఆయనకే ప్రత్యేకమైన సృష్టి సామర్థ్యాన్ని నిరూపించే వాక్యాలతో ప్రజల అనుమానాలను నివారిస్తుంది. సమస్తాన్ని సృష్టించింది అల్లాహ్. ఒకసారి సృష్టించిన ఆయనకు మరోసారి సృష్టించడం చాలా తేలిక. మరణించిన వారిని మళ్ళీ సృష్టించి నిలబెట్టడం ఆయనకు సులభసాధ్యం. ఈ సందర్భంగా దేవుని సృష్టి సామర్థ్యం గురించిన వివరాలను కూడా ఈ సూరా ఇక్కడ పొందుపరిచింది. దివ్యఖుర్ఆన్‌ను సత్యంగా పేర్కొంది. ఇందులో ఎలాంటి అనుమానం లేదని, ఇదొక హెచ్చరిక అని తెలియజేసింది. ఈ సూరాలోని 15వ ఆయతులో వచ్చిన 'సజ్దా' (సాష్టాంగ ప్రణామం) ప్రస్తావన ఆధారంగా దీనికి ఈ పేరు పెట్టడం జరిగింది. ఈ ఆయత్‌లో విశ్వాసుల గుణగణాలను వర్ణించడం జరిగింది. విశ్వాసులు దేవుని చిహ్నాలను విశ్వసిస్తారు. దేవుని చిహ్నాల గురించి వారికి గుర్తుచేసినప్పుడు వారు భక్తితో సాష్టాంగపడతారు. తమ ప్రభువైన అల్లాహ్‌ను స్తుతిస్తారు. గతకాలాల్లో అవిశ్వాసానికి పాల్పడిన జాతులకు ఎలాంటి గతి పట్టిందో ఈ సందర్భంగా గుర్తు చేస్తూ ఈ సూరా అవిశ్వాసులను హెచ్చరించింది. గతంలో అనేక జాతులు నాశనం చేయబడ్డాయని, ఈ వాస్తవాన్ని అల్లాహ్ చిహ్నాల్లో ఒకటిగా గుర్తించాలని చెప్పడం జరిగింది.

ఈ సూరాలో దేవుని శక్తిసామర్థ్యాలను వివరించడం జరిగింది. అల్లాహ్ ఆకాశాలను, భూమిని సృష్టించాడు. భూమ్యాకాశాల మధ్య ఉన్న సమస్తాన్ని సృష్టించాడు. ఈ సృష్టిని ఆయన ఆరురోజుల్లో పూర్తిచేసాడు. ఆయన ఆకాశాలను, భూమిపై జరిగే అన్ని వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నాడు. ఆయన కంటికి కనిపించని సమస్త విషయాలు తెలిసినవాడు. ఈ అగోచరాలు మన ఇంద్రియజ్ఞానంతో గ్రహించడానికి వీలు కానివి. ఆయన మనిషిని మట్టి నుంచి సృష్టించాడు. ఆయన మనిషికి వినే, చూసే శక్తిని ఇచ్చాడు. ముఖ్యమైన అవయవాలు ప్రసాదించాడు. ఆయన పొడి నేలపై వర్షాన్ని కురిపించి పంటలు పండేలా చేస్తున్నాడు. ప్రజలకు ఉపాధి కల్పిస్తున్నాడు. వారి పశువులకు ఆహారం లభించేలా చేస్తున్నాడు.

## 32. అస్సజ్దహ్[1] సూరా

## سُوْرَةُ السَّجْدَةِ

అవతరణ :మక్కా ఆయతులు : 30

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

**1 – 2** అలిఫ్ – లామ్ – మీమ్. (ఇది) సర్వలోకాల ప్రభువు తరపున అవతరింప జేయబడిన గ్రంథం. ఇందులో ఎలాంటి సందేహమే లేదు.[2]

الٓمّٓ ۝١ تَنْزِيْلُ الْكِتٰبِ لَا رَيْبَ فِيْهِ مِنْ رَّبِّ الْعٰلَمِيْنَ ۝٢

**3** ఏమిటీ, ఇతను (ప్రవక్త) స్వయంగా దీనిని కల్పించుకున్నాడని వారంటు న్నారా?[3] (ముమ్మాటికీ కాదు) వాస్తవానికి ఇది నీ ప్రభువు తరపు నుండి వచ్చిన సత్యం – నీకు పూర్వం హెచ్చరించే వాడె వడూ రానివారిని నువ్వు హెచ్చరించ టానికి,[4] తద్వారా వారు సన్మార్గానికి రావటానికిగాను (ఇది పంపబడినది).

اَمْ يَقُوْلُوْنَ افْتَرٰىهُ ۚ بَلْ هُوَ الْحَقُّ مِنْ رَّبِّكَ لِتُنْذِرَ قَوْمًا مَّآ
اَتٰىهُمْ مِّنْ نَّذِيْرٍ مِّنْ قَبْلِكَ لَعَلَّهُمْ يَهْتَدُوْنَ ۝٣

1. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) శుక్రవారం నాడు ఉదయం (ఫజ్ర్) నమాజులోని మొదటి రకాతులో సజ్దా సూరాను పారాయణం చేసేవారనీ, రెండవ రకాతులో సూరె దహర్ (హల్ అతాక అలల్ ఇన్సాని) పఠించేవారని హదీసు ద్వారా తెలుస్తోంది. (సహీహ్ బుఖారీ, ముస్లిం – కితాబుల్ జుముఅ). అలాగే మహాప్రవక్త (స) రాత్రిపూట నిద్రపోయే ముందు సూరె సజ్దాను, సూరె ముల్క్‌ను పారాయణం చేసేవారని ప్రామాణిక ఆధారాల ద్వారా తెలుస్తోంది (తిర్మిజీ – నెం. 892; ముస్నదె అహ్మద్ – 3/340).
2. అంటే ఇదేదో కట్టుకథల సంకలనంగానీ, జోతిష్యంగానీ, పుక్కిటి పురాణంగానీ, అసత్యంగానీ ఎంతమాత్రం కాదు. పైగా ఇది సర్వలోక ప్రభువు అయిన అల్లాహ్ నుండి పంపబడిన మార్గదర్శక గ్రంథం.
3. ఈ ఆయతులో సత్యతిరస్కారులకు హెచ్చరిక ఉంది. అనితర సాధ్యమైన ఈ గ్రంథరాజం విషయంలో వారు ఇలాంటి తప్పుడు ఆరోపణలు ఎందుకు చేస్తున్నారు. ముహమ్మద్ (సఅసం) స్వయంగా దీన్ని కల్పించాడని అనటానికి వారి దగ్గర ఉన్న ఆధారం ఏమిటి?
4. ఖుర్‌ఆన్ అవతరణ వెనుక గల ప్రధాన ఉద్దేశం ఇక్కడ తెలియజేయబడింది. అరబ్బుల

اللّٰهُ الَّذِيْ خَلَقَ السَّمٰوٰتِ وَالْاَرْضَ وَمَا بَيْنَهُمَا فِيْ سِتَّةِ اَيَّامٍ ثُمَّ اسْتَوٰى عَلَى الْعَرْشِ ۭ مَا لَكُمْ مِّنْ دُوْنِهٖ مِنْ وَّلِيٍّ وَّلَا شَفِيْعٍ ۭ اَفَلَا تَتَذَكَّرُوْنَ ④

**4** అల్లాహ్‌యే ఆకాశాలనూ, భూమినీ, వాటి మధ్యనున్న సమస్తాన్నీ ఆరు రోజులలో సృష్టించాడు. ఆ తరువాత సింహాసనాన్ని (అర్ష్‌ను) అధిష్టించాడు.[5] ఆయన తప్ప మీకు ఏ సహాయకుడూ, మరే సిఫారసు చేసే వాడూ లేడు.[6] అయినా మీరు హితబోధను గ్రహించరేమిటీ?[7]

يُدَبِّرُ الْاَمْرَ مِنَ السَّمَاۗءِ اِلَى الْاَرْضِ ثُمَّ يَعْرُجُ اِلَيْهِ فِيْ يَوْمٍ كَانَ مِقْدَارُهٗٓ اَلْفَ سَنَةٍ مِّمَّا تَعُدُّوْنَ ⑤

**5** ఆయనే ఆకాశాలు మొదలుకుని భూమి వరకు (ప్రతి) పనిని నడుపుతున్నాడు.[8] మరి అది (ఆ పని) మీరు లెక్కించే వెయ్యి సంవత్సరాలంతటి[9] ఒకానొక రోజున పైకి ఆయన వద్దకు చేరిపోతుంది.

దిద్దుబాటు కోసం మహాప్రవక్త (స)కు మునుపు ఏ ప్రవక్తా రాలేదని కూడా ఈ ఆయతు ద్వారా అవగతమవుతోంది. అయితే హ్రజత్ షుఐబ్ (అలైహిస్సలాం)ను కొంతమంది అరబ్బుల ప్రవక్తగా ఖరారు చేస్తారు. మరి ఆ లెక్కన పూర్వం హెచ్చరించ బడని జాతివారు అంటే బహుశా కురైషులు అయి ఉంటారు. బహుశా కురైషుల వద్దకు పంపబడిన ఏకైక ప్రవక్త ముహమ్మద్ (స) అన్నది దీని అంతరార్థం అయి ఉండవచ్చు.

5. దీనికి సంబంధించిన వివరాల కోసం ఆరాఫ్ సూరా 54వ ఆయతు క్రింద ఇవ్వబడిన పాదసూచికను చూడండి.

6. అంటే దైవసమక్షంలో మీకు తోడ్పడగల స్నేహితుడెవడూ ఉండడు. మీకోసం సిఫారసు చేసేవాడు కూడా అక్కడ ఎవడూ ఉండడు.

7. ఓ దైవేతర పూజారులారా! అల్లాహ్‌ను వదలి ఇతరులను నమ్ముకునేవారలారా! ఇంతగా విడమరచి చెప్పినా మీకు విషయం బోధపడటం లేదా? మీరు గుణపాఠం గ్రహించరా?

8. ఆకాశాన, తాను అధిష్టించి వున్న అర్ష్ (సింహాసనం) వద్ద నుంచి అల్లాహ్ భూమిపైకి తన ఆదేశాలను జారీ చేస్తున్నాడు. ఏది ఎప్పుడు, ఎక్కడ, ఎలా జరగాలో పకడ్బందీగా వ్యూహ రచన చేస్తున్నాడు. వాటిని ప్రవేశపెడుతున్నాడు. ఉదాహరణకు : జీవన్మరణాలు, స్వస్థత, అస్వస్థత, కలిమిలేములు, జయాపజయాలు, యుద్ధాలు సంధులు మొదలగునవి. అల్లాహ్ అర్ష్ అనే తన అధికార పీఠంపై నుంచే, తన నిర్ణయానుసారం ఈ ప్రణాళికను రచించి, నడుపుతాడు.

9. కడకు ఆయనకు సంబంధించిన ఈ కార్యం లేక ఉపాయం ఏదో ఒక రోజున

| | |
|---|---|
| **6** ఆయనే గోప్యంగా, బహిర్గతంగా ఉన్న వాటిని ఎరిగినవాడు – అపార శక్తిసంపన్నుడు, అనంత కరుణామయుడు. | ذٰلِكَ عٰلِمُ الْغَيْبِ وَالشَّهَادَةِ الْعَزِيْزُ الرَّحِيْمُ ۝٦ |
| **7** ఆయన ఏ వస్తువును చేసినా చాలా చక్కగా చేశాడు.[10] మానవ సృష్టిని మట్టితో మొదలుపెట్టాడు.[11] | الَّذِيْٓ اَحْسَنَ كُلَّ شَيْءٍ خَلَقَهٗ وَبَدَاَ خَلْقَ الْاِنْسَانِ مِنْ طِيْنٍ ۝٧ |

ఆయన వద్దకే తిరిగి వెళ్ళిపోతుంది. దాన్ని దైవదూతలు ఊర్ధ్వలోకాల్లోకి తీసుకుపోతారు. అలా గొనిపోయే ఈ అంతరం చాలా పెద్దది. దైవదూత కాని వ్యక్తి గనక దాన్ని తీసుకుపోదలిస్తే వెయ్యి సంవత్సరాలు పడుతుంది. లేదా ప్రళయదినాన్ని దృష్టిలో పెట్టుకుని ఇలా అనబడి ఉండవచ్చు. ఆనాడు మానవుల కర్మలన్నీ దైవ సమక్షంలో సమర్పించబడతాయి. ఆ "రోజు" నిర్ధారణకు సంబంధించి ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతల మధ్య తీవ్రమయిన భేదాభిప్రాయాలున్నాయి. ఈ నేపథ్యంలో ఇమామ్ షౌకానీ, 15, 16 కథనాలను పొందుపరచారు. ఈ వ్యవహారంపై అంతిమ నిర్ణయానికి రావటం కన్నా, దీన్ని దైవాధీనం చేయటమే ఉత్తమమని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) అభిప్రాయపడ్డారు. 'ఐసరుత్తఫాసీర్' వ్యాఖ్యాత ఇలా అన్నారు : దివ్య ఖుర్‌ఆన్‌లో ఈ విషయం మూడు చోట్ల ప్రస్తావనకు వచ్చింది. ఈ మూడు చోట్లా మూడు వేర్వేరు దినాలు సూచించబడ్డాయి. అల్ హజ్ సూరా (47వ ఆయతు)లో 'ఆ రోజు' గురించి వచ్చింది. అల్ మఆరిజ్ సూరాలో 'ఆ రోజు' 50 వేల యేండ్లకు సమానంగా పేర్కొనబడింది. ఇక్కడ ఈ సూరాలో 'ఆ రోజు' అంటే ప్రాపంచిక జీవితపు ఆఖరి రోజు. ఆ రోజు ప్రాపంచిక వ్యవహారాలన్నీ నాశనమై అల్లాహ్ వైపుకు మరలించబడతాయి.

10. అల్లాహ్ ఏ వస్తువును సృష్టించినా ఏదో ఒక ఆశయంతో, పరమార్థంతో సృష్టించినదై ఉంటుంది. ఆ వస్తువులో దానికంటూ ఓ ప్రత్యేకత, అందం ఉంటాయి. ఆ మాటకొస్తే దేవుడు చేసిన ప్రతి వస్తువూ అందమైనదే. కొంతమంది వ్యాఖ్యాతలు **'అహ్సన'** (اَحْسَنَ) (ఉత్తమంగా) అన్నపదాన్ని ఇక్కడ 'పటిష్టమైన' అన్న అర్థంలో తీసుకున్నారు. అల్లాహ్ ప్రాణులన్నిటినీ అవి తమ అవసరాలు తెలుసుకునేలా సృష్టించాడని మరి కొందరు భాష్యం చెప్పారు.

11. అంటే – మొట్టమొదటిసారిగా అల్లాహ్ ఆదం (అలైహిస్సలాం)ను మట్టితో చేశాడు. అక్కడి నుంచి మనుజ జాతి సృష్టి ప్రక్రియ ఆరంభమైనది. ఆదం భార్యను ఆదం ఎడమవైపు ప్రక్కటెముకతో సృష్టించాడని హదీసుల ద్వారా అవగతమవుతోంది.

**8** ఆ తరువాత అతని సంతతిని అత్యంత అల్పమైన నీటి సారం (వీర్యం)తో కొన సాగించాడు.[12]

ثُمَّ جَعَلَ نَسْلَهٗ مِنْ سُلٰلَةٍ مِّنْ مَّآءٍ مَّهِيْنٍ ۚ ۝٨

**9** ఆ తరువాత తగు రీతిలో దానిని మలచి, అందులో తనవద్ద నుండి ఆత్మను ఊదాడు.[13] మరి ఆయనే మీ చెవులను, కళ్లను, హృదయాలను చేశాడు.[14] (ఈ ఉపకారాలకు కూడా) మీరు కృతజ్ఞతలు తెలుపుకునేది చాలా తక్కువే.[15]

ثُمَّ سَوّٰىهُ وَنَفَخَ فِيْهِ مِنْ رُّوْحِهٖ وَجَعَلَ لَكُمُ السَّمْعَ وَالْاَبْصَارَ
وَالْاَفْـِٕدَةَ ۭ قَلِيْلًا مَّا تَشْكُرُوْنَ ۝٩

**10** "ఏమిటీ, మేము మట్టిలో కలసి, మాయమయిపోయిన[16] తరువాత కూడా మళ్లీ సరికొత్తగా సృష్టించబడతామా?" అని అంటారు. అసలు విషయం ఏమి టంటే వారు తమ ప్రభువును కలుసుకోవ టాన్ని త్రోసిపుచ్చుతున్నారు.

وَقَالُوْٓا ءَاِذَا ضَلَلْنَا فِي الْاَرْضِ ءَاِنَّا لَفِيْ خَلْقٍ جَدِيْدٍ ڛ
بَلْ هُمْ بِلِقَاۗءِ رَبِّهِمْ كٰفِرُوْنَ ۝١٠

12. అంటే, రేతస్సు (వీర్యపు బిందువు)తో. అంటే ఒక మానవ జంటను సృష్టించిన పిదప మానవజాతి పరంపరను ముందుకు నడపటానికి ఆయన స్త్రీ పురుషుల వైవాహిక వ్యవస్థను ఏర్పరచాడు. భార్యాభర్తల సంభోగం సందర్భంగా పురుషుని నుంచి వెలువడే వీర్య బిందువు స్త్రీ గర్భాశయంలోకి ప్రవేశిస్తుంది. ఆ వీర్యకణం ద్వారా దేవుడు ఓ సంపూర్ణ మనిషిని సృజిస్తాడు.

13. అంటే మాతృగర్భంలో ఆ శిశువును వివిధ దశల్లో పెంచుతాడు. అతనికి శరీరావ యవాలు సమకూరుస్తాడు. నఖశిఖ పర్యంతం దాని రూపు రేఖలు తీర్చిదిద్దుతాడు. ఆ తరువాత అందులో ఆత్మను ఊదుతాడు.

14. ఆయన తన సృష్టికి పరిపూర్ణతను చేకూర్చడానికి వీటన్నింటినీ సమకూర్చాడు. వినవలసిన ప్రతి దానినీ మీరు వినగలిగేలా, చూడవలసిన ప్రతి వస్తువును మీరు చూడగలిగేలా, బుద్ధికి అందే ప్రతి విషయంపై మీరు ఆలోచించగలిగేలా దేవుడు మిమ్మల్ని మలిచాడు.

15. ఇన్ని మహోపకారాలు చేసిన తరువాత కూడా ఈ మనిషి కృతఘ్నుడుగానే ఉంటు న్నాడు. దేవునికి ధన్యవాదాలు తెలుపుకోవలసిన విధంగా తెలుపుకోవటం లేదు.

16. ఏదైనా ఒక వస్తువుపై మరో వస్తువు పూర్తిగా ప్రాబల్యం వహించినపుడు మొదటి వస్తువు తన గుణాన్ని క్రమక్రమంగా కోల్పోతుంది. దాన్నే అరబీలో **జలాలత్**గా

**11** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : “మీపై నియమించబడివున్న మృత్యుదూత మీ ప్రాణాలను వశపరచుకుంటాడు.[17] ఆ తరువాత మీరంతా మీ ప్రభువు వైపునకు మరలించబడతారు.”

قُلْ يَتَوَفّٰىكُمْ مَّلَكُ الْمَوْتِ الَّذِيْ وُكِّلَ بِكُمْ ثُمَّ اِلٰى رَبِّكُمْ تُرْجَعُوْنَ ﴿١١﴾

**12** అపరాధులు తమ ప్రభువు సమక్షంలో తలలు వంచుకుని ఉండటాన్ని నువ్వు చూస్తే ఎంత బావుంటుంది![18] (వారిలా అంటారు): “మా ప్రభూ! మేమంతా చూసు కున్నాము. (అంతా) విన్నాము.[19] ఇక మమ్మల్ని తిరిగి పంపించు. (ఇక నుంచి) మేము సత్కార్యాలు చేస్తాము. మాకిక పూర్తి నమ్మకం కలిగింది.”[20]

وَلَوْ تَرٰۤى اِذِ الْمُجْرِمُوْنَ نَاكِسُوْا رُءُوْسِهِمْ عِنْدَ رَبِّهِمْ ؕ رَبَّنَاۤ اَبْصَرْنَا وَسَمِعْنَا فَارْجِعْنَا نَعْمَلْ صَالِحًا اِنَّا مُوْقِنُوْنَ ﴿١٢﴾

**13** మేము గనక తలచుకుంటే, ప్రతి ఒక్కరికీ సన్మార్గం[21] ప్రసాదించి ఉండేవాళ్ళం. అయితే, “నేను నరకాన్ని

وَلَوْ شِئْنَا لَاٰتَيْنَا كُلَّ نَفْسٍ هُدٰىهَا وَلٰكِنْ حَقَّ الْقَوْلُ مِنِّيْ

పేర్కొంటారు. అంటే కనుమరుగు అవటం అన్నమాట. **‘జలల్‌నా ఫిల్ అర్జి’** అంటే “మట్టిలో కలసి మేము మా ఉనికిని కోల్పోయిన పిదప” అని అర్థం వస్తుంది.

17. అది మృత్యు దూత డ్యూటీ. మీ మరణ ఘడియ ఆసన్నమైనపుడు ఒక్క క్షణం కూడా తాత్సారం చేయకుండా ఆ దూత మీ ఆత్మను స్వాధీనం చేసుకుంటాడు.

18. అంటే తాము చేసిన పాపకార్యాలకు, తిరస్కార వైఖరికి, బహు దైవారాధనకు సిగ్గుతో కుమిలిపోతూ, తలలు వంచుకుని నిలబడి ఉంటారు.

19. “ఒకప్పుడు మేము త్రోసిపుచ్చే విషయాన్ని ఇప్పుడు కళ్ళారా చూశాము. ఒకప్పుడు పరిహసించిన దానిని గురించి ఇప్పుడు మా చెవులతో విన్నాము. నీ హెచ్చరికలోని వాస్తవికత మాకు బోధపడింది. ప్రవక్తల సందేశం సత్యమని తెలుసుకున్నాము” అని అంటారు. కాని ఆనాడు వారు గ్రహించిన సత్యం వారికేవిధంగానూ పనికిరాదు.

20. కాని ఏం లాభం? వారి గడువు తీరిపోయింది. ఇప్పుడు వారి కొరకు మిగిలిందల్లా పరాభవంతో కూడిన శిక్షే. దాన్ని వారు చవిచూడక తప్పదు.

21. అంటే ప్రాపంచిక జీవితంలో వారికి మా మార్గం చూపించి ఉండేవాళ్ళం. కాని బలవంతంగా జనులను దారికి తేవటం మా విధానం కాదు. బలవంతంగా మనుషుల మెడలు వంచి దారికితెస్తే, వారికి పెట్టిన పరీక్షకు అర్థమే ఉండదు.

لَأَمْلَأَنَّ جَهَنَّمَ مِنَ الْجِنَّةِ وَالنَّاسِ أَجْمَعِينَ ١٣

జిన్నులతోనూ, మనుషులతోనూ తప్పకుండా నింపుతాను” అన్న నా మాట నిజమయింది.[22]

فَذُوقُوا بِمَا نَسِيتُمْ لِقَاءَ يَوْمِكُمْ هَٰذَا إِنَّا نَسِينَاكُمْ وَذُوقُوا
عَذَابَ الْخُلْدِ بِمَا كُنتُمْ تَعْمَلُونَ ١٤

**14** ఇక మీరు, మీకు చెందిన ఈనాటి సమావేశాన్ని విస్మరించినందుకు (శిక్ష) రుచిని చూడండి. మేము కూడా మిమ్మల్ని విస్మరించాము.[23] ఇక మీరు చేసుకున్న చేష్టలకు (పర్యవసానంగా) శాశ్వతమైన శిక్ష రుచిచూడండి.

إِنَّمَا يُؤْمِنُ بِآيَاتِنَا الَّذِينَ إِذَا ذُكِّرُوا بِهَا خَرُّوا سُجَّدًا وَسَبَّحُوا
بِحَمْدِ رَبِّهِمْ وَهُمْ لَا يَسْتَكْبِرُونَ ١٥

**15** మా ఆయతులు బోధించబడినప్పుడు సజ్దాలో పడిపోయేవారు,[24] తమ ప్రభువును స్తుతిస్తూ ఆయన పవిత్రతను కొనియాడేవారు,[25] గర్వపడనివారు[26] మాత్రమే మా సూక్తులను నమ్ముతారు.[27]

22. అంటే మానవుల్లోని రెండు వర్గాలలో ఒక వర్గం జనుల చేత నరకాన్ని నింపుతానన్న నా వాగ్దానం అక్షరసత్యం అయింది.

23. మీరు ప్రాపంచిక జీవితంలో నన్ను విస్మరించారు. కాబట్టి ఇప్పుడు నేను మిమ్మల్ని విస్మరిస్తున్నాను. వాస్తవానికి అల్లాహ్‌కు మరుపు ఉండదు. కాని వారిని శిక్షించే ఉద్దేశంతో ఆయన వారిని కావాలని ఉపేక్షిస్తాడు.

24. దైవ వచనాలు విన్నంతనే భక్తీపారవశ్యంతో, భయంతో వారు దైవానికి ప్రణమిల్లుతారు (సజ్దాలో పడిపోతారు).

25. ఏ ఏ విషయాలు అల్లాహ్ ఔన్నత్యానికి శోభించవో వాటినుంచి తెగత్రెంపులు చేసుకుంటారు. ఆయన ప్రసాదించిన అపార అనుగ్రహాలకు గాను కృతజ్ఞతలు చెల్లిస్తారు. ఆయన ప్రసాదించిన అతి పెద్ద వరం సన్మార్గం. అందుకుగాను వారు దైవసమక్షంలో సాష్టాంగ ప్రణామం చేసి ఆయన పవిత్రతను కొనియాడతారు. **'సుబ్‌హానల్లాహి వబిహమ్దిహి'** లేదా **'సుబ్‌హాన రబ్బియల్ ఆలా వ బిహమ్దిహీ'** లాంటి వచనాలను సజ్దాలో తరచూ పలుకుతూ ఉంటారు.

26. అంటే దైవవిధేయతా మార్గాన్ని అవలంబిస్తారు. వారి మాటల్లో, చేతల్లో అహంకారం లేశమైనా ఉండదు. పైగా అణకువ, వినయవినమ్రతలు ఉట్టిపడుతూ ఉంటాయి. అజ్ఞానుల మాదిరిగా, అవిశ్వాసుల మాదిరిగా వారు బడాయిని చాటుకోరు. ఎందుకంటే దైవారాధన పట్ల గర్వాహంకారం ప్రదర్శించటం నరకానికి ద్వారం తెరవటం

تَتَجَافَىٰ جُنُوبُهُمْ عَنِ الْمَضَاجِعِ يَدْعُونَ رَبَّهُمْ خَوْفًا وَطَمَعًا وَمِمَّا رَزَقْنَاهُمْ يُنفِقُونَ ﴿١٦﴾

**16** వారి ప్రక్కలు వారి పడకల నుంచి వేరుగా ఉంటాయి.[28] వారు తమ ప్రభువును భయంతోనూ, ఆశతోనూ ప్రార్థిస్తారు.[29] మేము వారికి ప్రసాదించిన దానినుండి ఖర్చుపెడతారు.[30]

فَلَا تَعْلَمُ نَفْسٌ مَّا أُخْفِيَ لَهُم مِّن قُرَّةِ أَعْيُنٍ جَزَاءً بِمَا كَانُوا يَعْمَلُونَ ﴿١٧﴾

**17** వారు చేసిన కర్మలకు ప్రతిఫలంగా,[31] వారి కళ్లకు చలువనిచ్చే ఎలాంటి సామగ్రిని మేము దాచిపెట్టామో (దాని గురించి) ఏ ప్రాణికీ తెలియదు.[32]

---

వంటిదే. "నా ఆరాధన పట్ల గర్వాహంకారం ప్రదర్శించే వారు అతి త్వరలోనే పరాభవంపాలై నరకంలో ప్రవేశిస్తారని తెలుసుకోండి" (మోమిన్ – 60). అందువల్ల విశ్వసించినవారి పరిస్థితి దీనికి భిన్నంగా ఉంటుంది. వారు దైవసమక్షంలో ఎల్లప్పుడూ తమ దీనావస్థను, అశక్తతను, వినమ్రతను వ్యక్తపరుస్తూ ఉంటారు.

27. అంటే మా ఆయతులు సత్యమైనవని ధృవీకరిస్తారు. వాటి ద్వారా పూర్తిగా ప్రయోజనం పొందుతారు.

28. అంటే రాత్రిపూట తియ్యటి నిద్రను వదలి కొంతసేపు స్వచ్ఛంద ఆరాధనలు (తహజ్జుద్ నమాజు) చేస్తారు. క్షమాపణ కొరకు అల్లాహ్‌ను వేడుకుంటూ ఉంటారు. దైవానికి తమ శ్రద్ధాభక్తుల నివాళిని ఘటిస్తారు.

29. అంటే దైవకారుణ్యంపై, ఆయన కృపపై ఆశలుపెట్టుకుంటారు. అలాగే దైవాగ్రహం పట్ల, ఆయన వేసే ప్రశ్నల పట్ల భీతిల్లుతూ ఉంటారు. ఈ భయభక్తులే గనక లేకుండా పోతే ఆరాధనల్లో అశక్తత, అణకువ ఉండవు. అదేవిధంగా భక్తులలో దైవకారుణ్యం పట్ల ఆశాభావం కూడా మెండుగా ఉండాలి. లేకపోతే వారు నిరాశా నిస్పృహలకు లోనైపోతారు. నిరాశ మార్గవిహీనత వైపుకు, తిరస్కారం వైపుకు తీసుకుపోతుంది.

30. ఈ **'ఖర్చు'**లో విధిగా చెల్లించవలసిన దానాల (జకాత్)తో పాటు, స్వచ్ఛంద దానధర్మాలు కూడా చేరి ఉన్నాయి. విశ్వాసులు ఈ రెండు రకాల దానాలు కూడా ఇస్తారు.

31. దీన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే దైవకారుణ్యానికి పాత్రులు కాగలగటానికి సదాచరణ చేయటం అనివార్యం.

32. విశ్వాసుల కొరకు అల్లాహ్ దాచిపెట్టిన అనుగ్రహాల గురించి అల్లాహ్‌కు తప్ప వేరెవరికీ తెలీదు. అవి విశ్వాసుల కొరకు కన్నుల పండువగా ఉంటాయి. ఈ దైవానుగ్రహాల గురించి మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) హదీసె ఖుద్సీలో ఇలా వివరించారు :

**18** ఏమిటి? విశ్వసించిన వ్యక్తిని అవిధేయునితో సరిపోల్చటం తగునా? వారిద్దరు ఎన్నటికీ సమానులు కాజాలరు.[33]

أَفَمَنْ كَانَ مُؤْمِنًا كَمَنْ كَانَ فَاسِقًا ۚ لَا يَسْتَوُونَ ﴿١٨﴾

**19** ఎవరు విశ్వసించి, సత్కార్యాలు కూడా చేశారో వారు చేసుకున్న కర్మలకు బదులుగా వారికి శాశ్వతమైన స్వర్గనివాసం ఆతిథ్యంగా లభిస్తుంది.

أَمَّا الَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ فَلَهُمْ جَنَّاتُ الْمَأْوَىٰ
نُزُلًا بِمَا كَانُوا يَعْمَلُونَ ﴿١٩﴾

**20** మరెవరు అవిధేయతకు ఒడిగట్టారో వారి నివాసస్థలం నరకం అవుతుంది. దాన్నుంచి బయటపడేందుకు వారు ప్రయత్నించినప్పుడల్లా అందులోనికే నెట్టివేయబడతారు.[34] "మీరు తిరస్కరిస్తూ ఉండిన అగ్ని శిక్షను చవిచూడండి"[35] అని వారితో అనబడుతుంది.

وَأَمَّا الَّذِينَ فَسَقُوا فَمَأْوَاهُمُ النَّارُ ۖ كُلَّمَا أَرَادُوا أَنْ يَخْرُجُوا
مِنْهَا أُعِيدُوا فِيهَا وَقِيلَ لَهُمْ ذُوقُوا عَذَابَ النَّارِ الَّذِي
كُنْتُمْ بِهِ تُكَذِّبُونَ ﴿٢٠﴾

అల్లాహ్ సెలవిచ్చాడు – "నేను సజ్జనులైన నా దాసుల కోసం ఏ కన్నూ కానని, ఏ చెవీ వినని, ఏ మనిషీ ఊహించనైనాలేని వస్తువులను సిద్ధం చేసి ఉంచాను" (సహీహ్ బుఖారీ – సజ్దహ్ సూరా వ్యాఖ్యానం)

33. అల్లాహ్ దృష్టిలో విశ్వాసి – అవిశ్వాసి ఎట్టి పరిస్థితిలోనూ సమానులు కాలేరు. వారిద్దరి మధ్య అసాధారణమైన వ్యత్యాసం ఉంది. విశ్వాసులు దేవుని అతిథులుగా ఉంటారు. వారు అన్ని విధాలా గౌరవమర్యాదలకు అర్హులవుతారు. మరోవైపు అవిశ్వాసులు సంకెళ్ళలో బంధించబడి ఉంటారు. నరకాగ్నిలో మాడుతూ ఉంటారు. ఈ విషయం ఇతర చోట్ల కూడా వివరించబడింది. ఉదాహరణకు: అల్ జాసియా సూరా – 21, సాద్‌సూరా – 28, హష్ర్ సూరా – 20.

34. నరక యాతనకు తట్టుకోలేక వారు దాన్నుంచి బయటపడేందుకు పదే పదే ప్రయత్నిస్తారు. కాని వారలా ప్రయత్నించిన ప్రతిసారీ నరక దూతలు వారిని లోపలికి తోస్తూ ఉంటారు.

35. ఇవి నరక దూతల పలుకులు. లేదా అల్లాహ్ తరఫునే ఈ విధంగా అనబడవచ్చు. మొత్తానికి ఈ మాటలు ఎవరు పలికినా అవి దైవధిక్కారుల పాలిట అత్యంత అవమానకరమైనవి.

**21** ఆ పెద్ద శిక్షకు ముందు మేము వారికి సమీపంలోని కొన్ని (చిన్నపాటి) శిక్షల[36] రుచి తప్పకుండా చూపిస్తూ ఉంటాము- (ఆ విధంగానయినా) వారు దారికి వస్తారని![37]

وَلَنُذِيقَنَّهُم مِّنَ الْعَذَابِ الْأَدْنَىٰ دُونَ الْعَذَابِ الْأَكْبَرِ لَعَلَّهُمْ يَرْجِعُونَ ﴿٢١﴾

**22** తన ప్రభువు ఆయతుల ఆధారంగా బోధపరచినప్పటికీ వాటినుండి ముఖం త్రిప్పుకుపోయిన వానికంటే దుర్మార్గు డెవడుంటాడు?[38] మేము కూడా (అలాంటి) పాపాత్ములకు తప్పకుండా ప్రతీకారం చేస్తాము.

وَمَنْ أَظْلَمُ مِمَّن ذُكِّرَ بِآيَاتِ رَبِّهِ ثُمَّ أَعْرَضَ عَنْهَا ۚ إِنَّا مِنَ الْمُجْرِمِينَ مُنتَقِمُونَ ﴿٢٢﴾

**23** నిశ్చయంగా మేము మూసాకు గ్రంథం వొసగి ఉన్నాము. కాబట్టి అతన్ని కలుసుకునే విషయంలో నువ్వు ఏమాత్రం సంశయంలో పడకూడదు.[39] మేము దానిని[40] ఇస్రాయీల్ సంతతి వారికోసం మార్గదర్శక సాధనంగా చేశాము.

وَلَقَدْ آتَيْنَا مُوسَى الْكِتَابَ فَلَا تَكُن فِي مِرْيَةٍ مِّن لِّقَائِهِ ۖ وَجَعَلْنَاهُ هُدًى لِّبَنِي إِسْرَائِيلَ ﴿٢٣﴾

36. **'చిన్నపాటి శిక్షలు'** (అజాబున్ అద్నా) అంటే ప్రాపంచిక జీవితంలో ఎదురయ్యే కష్టాలు, ఆపదలు, రోగాలు మొదలైనవి. బద్ర్ యుద్ధంలో అవిశ్వాసులకు ఎదురైన ఘోర పరాజయం లేదా మక్కాలో సంభవించిన కరువు కాటకాల నేపథ్యంలో ఈ విధంగా అనబడిందని కొంతమంది వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు. అయితే ఇక్కడ ప్రస్తావించబడిన ఆపదలన్నీ ఇందులోకి వస్తాయని ఇమామ్ షౌకానీ భావిస్తున్నారు.

37. పరలోకంలో విధించబడే పెద్ద శిక్షకు ముందు - హెచ్చరికగా - ఈ చిన్న చిన్న శిక్షలను వారిపై పంపటంలోని ముఖ్యోద్దేశం ఇక్కడ సూచించబడింది - వారు పాపాలను పరిత్యజించి, షిర్క్‌ను మానుకుని, కుఫ్ర్‌ను వదలుకుని రుజుమార్గంపైకి వస్తారేమోనని!

38. విశ్వాసం, విధేయత వైపుకు పిలుపు ఇచ్చే దివ్య వచనాలను విన్న తరువాత కూడా వాటిని లక్ష్యపెట్టకుండా తిరిగి వెళ్ళిపోయేవాడు అందరికన్నా పరమదుర్మార్గుడు.

39. మేరాజ్ యాత్ర సందర్భంగా హజ్రత్ మూసా (అలైహిస్సలాం)ను మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) కలిసిన విషయం ఇందులో సూచించబడిందని అనబడుతోంది. ఈ సందర్భంగానే నమాజుల సంఖ్యను తగ్గించుకోమని మూసా (అలైహి) అంతిమ దైవప్రవక్త (స)కు సలహా ఇచ్చారు.

40. **'దానిని'** అంటే 'తౌరాత్ గ్రంథాన్ని' అని భావించాలి. ఒకవేళ 'అతన్ని' అని అనువదించుకుంటే హజ్రత్ మూసా (అలైహిస్సలాం) అని అనుకోవలసి ఉంటుంది.

**24** మరి వారు సహన స్థయిర్యాలను కనబరచినప్పుడు, మా ఆదేశానుసారం జనులకు మార్గదర్శకత్వం వహించే నాయకులను మేము వారిలో చేశాము. వారు మా ఆయతులపై దృఢ విశ్వాసం కలిగి ఉండేవారు.[41]

وَجَعَلْنَا مِنْهُمْ أَئِمَّةً يَهْدُونَ بِأَمْرِنَا لَمَّا صَبَرُوا ۖ وَكَانُوا بِآيَاتِنَا يُوقِنُونَ ﴿٢٤﴾

**25** వారు పరస్పరం విభేదించుకుంటున్న విషయాలపై ప్రళయదినాన నీ ప్రభువు వారి మధ్య (తప్పకుండా) తీర్పు చేస్తాడు.[42]

إِنَّ رَبَّكَ هُوَ يَفْصِلُ بَيْنَهُمْ يَوْمَ الْقِيَامَةِ فِيمَا كَانُوا فِيهِ يَخْتَلِفُونَ ﴿٢٥﴾

**26** ఏమిటీ, మేము వారికి పూర్వం ఎన్నో సమాజాలను తుదముట్టించిన సంగతి కూడా వారికి సన్మార్గం చూపలేదా? మరి (చూడబోతే) వాళ్ళు నివసించిన స్థలాలలోకి వారు వస్తూపోతూనే

أَوَلَمْ يَهْدِ لَهُمْ كَمْ أَهْلَكْنَا مِن قَبْلِهِم مِّنَ الْقُرُونِ يَمْشُونَ فِي مَسَاكِنِهِمْ ۚ إِنَّ فِي ذَٰلِكَ لَآيَاتٍ ۖ أَفَلَا يَسْمَعُونَ ﴿٢٦﴾

41. ఈ ఆయతులో సహనస్థయిర్యాల మహత్యం గురించి చెప్పబడింది. సహనస్థయిర్యాలంటే అసలు అర్థం – దైవాజ్ఞల్ని పాటించటంలో, దైవప్రవక్తలను నమ్మి, వారిని అనుసరించటంలో ఎదురయ్యే కష్టాలను ఉత్తమ రీతిలో సహించటం, ప్రతికూల పవనాలకు ఎదురీదటం. వారు సహనం వహించి, దైవ వచనాలను దృఢంగా విశ్వసించినందున తాను వారికి ధార్మిక నేతృత్వాన్ని ప్రసాదించానని అల్లాహ్ అంటున్నాడు. కాని ఆ తరువాత వారు దైవధర్మంలో మార్పులు చేర్పులు చేసి, మనోవాంఛలను అనుసరించగానే వారినుంచి నాయకత్వ హోదాను లాక్కున్నాడు. అటుపిమ్మట వారి హృదయాలలో కాఠిన్యం వచ్చేసింది. సదాచరణ క్షీణించింది. ఫలితంగా వారి విశ్వాసం గాడి తప్పింది.

42 గ్రంథం కల ప్రజల మధ్య ఎన్నో విభేదాలు ఉండేవి. వాటికి తోడు విశ్వాసులకు – అవిశ్వాసులకు మధ్య గల అభిప్రాయభేదాలు కూడా ఇందులోకి వస్తాయి. ఏకదైవారాధకులకు, మిథ్యావాదులకు మధ్య గల భేదాభిప్రాయాలు కూడా ఈ సందర్భంగా చర్చకు వస్తాయి. వాస్తవమేమిటంటే లోకంలోని ప్రతివర్గం తన అభిమతమే సత్యమైనదని వాదిస్తుంది. తన సిద్ధాంతంపైనే అది స్థిరంగా ఉంటుంది. అందువల్ల ఈ విభేదాలపై తీర్పుదినాన అల్లాహ్‌యే తీర్పు చేస్తాడు. అంటే సత్యవాదులను స్వర్గంలో చేర్చి, అసత్యవాదులను నరకాగ్నికి ఆహుతి చేస్తాడు.

ఉన్నారు.[43] నిశ్చయంగా ఇందులో (గొప్ప) సూచనలున్నాయి. అయినప్పటికీ వారు వినరా?

**27** ఏమిటీ, వీళ్లు గమనించటం లేదా? – మేము నీళ్ళను బంజరుభూమి వైపుకు ప్రవహింపజేస్తూ తీసుకుపోతున్నాము, మరి దాని ద్వారా పంటలను వెలికి తీస్తున్నాము. వాటిని వారి పశువులూ తింటున్నాయి. స్వయంగా వారు కూడా (తింటున్నారు).[44] అయినా వాళ్ళు దృష్టిని సారించరా?

أَوَلَمْ يَرَوْا أَنَّا نَسُوقُ الْمَاءَ إِلَى الْأَرْضِ الْجُرُزِ فَنُخْرِجُ بِهِ زَرْعًا تَأْكُلُ مِنْهُ أَنْعَامُهُمْ وَأَنْفُسُهُمْ أَفَلَا يُبْصِرُونَ ﴿٢٧﴾

**28** "ఇంతకీ ఈ తీర్పు ఎప్పుడు జరుగుతుంది? మీరు సత్యవంతులే అయితే (చెప్పండి)"[45] అని వారంటున్నారు.

وَيَقُولُونَ مَتَىٰ هَٰذَا الْفَتْحُ إِنْ كُنْتُمْ صَادِقِينَ ﴿٢٨﴾

**29** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు: "తీర్పు జరిగే దినాన విశ్వసించటం అవిశ్వాసులకు ఏ విధంగానూ ఉపకరించదు. వారికి గడువు కూడా ఇవ్వబడదు."[46]

قُلْ يَوْمَ الْفَتْحِ لَا يَنْفَعُ الَّذِينَ كَفَرُوا إِيمَانُهُمْ وَلَا هُمْ يُنْظَرُونَ ﴿٢٩﴾

43. ధిక్కార వైఖరి మూలంగా వెనుకటి మానవ సమాజాలు ఎన్నో నామరూపాలు లేకుండా తుడిచిపెట్టబడ్డాయి. కాకపోతే వాళ్ల నివాస స్థలాలు, పాడుబడిన ఇళ్లు ఉన్నాయి. అవి వీళ్ల అధీనంలోనే ఉన్నాయి. ఇదంతా వీళ్లు గమనించటం లేదా? – మక్కాకు చెందిన సత్యతిరస్కారులకు హెచ్చరికగా ఈ మాటలనబడ్డాయి. ఒకవేళ మీరు గనక సత్యధర్మాన్ని విశ్వసించకపోతే మీకూ అదే గతి పడుతుందని వార్నింగ్ ఇవ్వటం జరిగింది.

44. **'నీళ్లు'** (الماء) అంటే వర్షపు నీరు, నదీనదాల, కాలువల నీరు అన్నమాట! ఈ నీటిని దేవుడు బంజరు భూముల వైపుకు ప్రవహింపజేసి పంటలు పండిస్తాడు. వాటిని మనుషులు తినటంతో పాటు పశువులు కూడా మేస్తాయి. బంజరు భూమి అంటే అది ప్రత్యేకంగా ఏదో ఒక ప్రాంతానికి చెందినది కాదు. అన్ని ప్రాంతాలకు వర్తిస్తుంది.

45. ఇక్కడ **తీర్పు** (ఫత్‌హు) అంటే భావం మక్కా అవిశ్వాసులు మహాప్రవక్త (సఅసం)ను డిమాండు చేసిన దైవశిక్ష. వారు ఇలా డిమాండు చేసేవారు: "ఓ ముహమ్మద్ (సఅసం)!

| | |
|---|---|
| **30** కనుక (ఓ ముహమ్మద్ – స!) వాళ్ళ సంగతిని వదలిపెట్టు.[47] నిరీక్షించు.[48] వాళ్ళు కూడా నిరీక్షిస్తున్నారు.[49] | فَأَعْرِضْ عَنْهُمْ وَانْتَظِرْ إِنَّهُمْ مُنْتَظِرُونَ ﴿٣٠﴾ |

నీకు నీ దేవుని తోడ్పాటు ఎప్పుడు అందుతుంది? నిన్ను ప్రవక్తగా నమ్మిన వారంతా భయపడి, దాక్కుంటున్నారు. నువ్వేమో దైవసహాయం రానున్నదని అంటున్నావు."

46. ఈ ఆయతులో తీర్పు అంటే పరలోకంలో జరిగే తీర్పు అని భావం. అక్కడ ఎవరయినా తాము 'విశ్వసించాము' అని ప్రకటిస్తే, వారి విశ్వాసం స్వీకారయోగ్యం అవదు. వారికి గడువు కూడా ఇవ్వబడదు. కొంతమంది ఈ ఆయతులోని 'తీర్పు'ను 'మక్కా విజయం'గా తలపోశారు. కాని ఇది సరైంది కాదు. ఎందుకంటే మక్కా విజయం నాడు శత్రువుల (అవిశ్వాసుల) ఇస్లాం స్వీకరణ దైవసన్నిధిలో స్వీకృతి పొందింది. అలా ఇస్లాం స్వీకరించిన వారి సంఖ్య రెండు వేల దాకా ఉంది (ఇబ్నె కసీర్). మహాప్రవక్త ముహమ్మద్ (స) ప్రకటించిన సర్వసాధారణమైన మన్నింపుల ప్రకటనకు ప్రభావితులై ఆ శత్రువులు ఇస్లాం స్వీకరించారు. మక్కా విజయం నాడు మహాప్రవక్త(స) తన బద్ధ విరోధులనుద్దేశించి ఇలా అన్నారు: "ఈ రోజు మీపై ఎలాంటి ఫిర్యాదూ లేదు. మీ వెనుకటి దురాగతాలకు ప్రతీకారం ఈనాడు తీర్చుకోబడదు, పొండి."

47. కనుక ఓ ముహమ్మద్(స)! ఈ ముష్రిక్కుల గురించి అదేపనిగా ఆలోచించకు. వాళ్ళను వాళ్ళ మానాన వదలిపెట్టి, నీ కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగించు. నీపై అవతరింపజేయబడిన సందేశాన్ని (వహీని) అనుసరించు అని దీని భావం. ఆ మాటే వేరొకచోట ఈ విధంగా చెప్పబడింది: "(ఓ ముహమ్మద్–సఅసం!) నువ్వు మాత్రం నీ ప్రభువు తరఫు నుంచి నీపై అవతరించిన సందేశాన్ని (వహీని) అనుసరిస్తూ ఉండు. అల్లాహ్ తప్ప వేరెవరూ ఆరాధనకు అర్హులు కారు. బహు దైవారాధకుల్ని పట్టించుకోకు." (అల్ అన్ఆమ్ – 106).

48. అల్లాహ్ వాగ్దానం కోసం, ఆయన నీకు చేసే సహాయం కోసం ఎదురు చూస్తూ ఉండు. అల్లాహ్ వాగ్దానం నెరవేరటం తథ్యం.

49. ఈ ప్రవక్త (స) కష్టాల్లో చిక్కుకుంటాడనీ, అతని సందేశ కార్యక్రమం అర్థాంతరంగా ఆగిపోతుందని ఈ అవిశ్వాసులు కాకిలెక్కలు వేసేవారు. కాని అచిరకాలంలోనే దేవుడు తన ప్రవక్త (స)కు చేసిన వాగ్దానాన్ని నెరవేర్చటం, ప్రజలు తండోపతండాలుగా వచ్చి సత్యధర్మాన్ని స్వీకరించటం లోకం చూసింది. ఆయన (స) కష్టాల్లో చిక్కు కుంటారని ఊహించిన వారంతా ఘోర అవమానానికి గురయ్యారు.